క్లుప్తంగా

సాయిబాబా మందిరంలో పూజలు



ప్రత్యేక అలంకారంలో సాయిబాబా

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయిబాబాకు అభిషేకాలు, అర్చనలు అనంతరం పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక హారతులిచ్చారు. పలు గ్రామాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు మధ్యాహ్నం భక్తుల కోసం, శ్రీశైలం వెళ్లే కాలినడక భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన



మాట్లాడుతున్న డీటీ నాగార్జునరెడ్డి

దొనకొండ: స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డిప్యూటీ తహసీల్దార్ నాగార్జున రెడ్డి ఓటు హక్కుపై గురువారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ఓటు దరఖాస్తు చేసుకునేందుకు ఫారం-6 ఉపయోగించుకోవాలన్నారు. ఓటు దరఖాస్తుకు ఆన్‌లైన్, మొబైల్ యాప్‌లో కూడా చేసుకోవచ్చన్నారు. నేటి వరకు ఓటు లేని యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆర్ఐ ఎం.రామారావు, వీఆర్ఓ మాచర్ల, కళాశాల అడ్మిన్ నాని, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ధైర్య సాహసాలతో ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై మల్లికార్జునరావు

తాళ్లూరు: విద్యార్థులు ధైర్య సాహసాలు కలిగి ఉండాలని ఎస్సై మల్లికార్జునరావు సూచించారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో సైబర్ క్రైమ్, ఉమెన్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శారీరక, మానసిక ధృడత్వం కలిగి ఉండాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే శరీర పటుత్వం పెరుగుతుందన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై నాగరాజు

ముండ్లమూరు (దర్శి): రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై నాగరాజు అన్నారు. స్థానిక మోడల్ స్కూల్లో విద్యార్థులకు సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే విద్యార్థి దశ నుంచి నిబంధనలు పాటించాలన్నారు. మహిళలు, చిన్న పిల్లలు మీద జరిగే నేరాలు, వాటి పర్యావసానం గురించి క్లుప్తంగా వివరించారు. బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ముండ్లమూరు (దర్శి): మండలంలోని మారెళ్లలో బెల్ట్‌షాపులపై రైడ్ చేసి 8 మద్యం బాటిళ్లను ఎస్సై నాగరాజు గురువారం స్వాధీనం చేసుకున్నారు. గోపతోటి లాజర్ అనే వ్యక్తి అక్రమంగా ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్ కోసం నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై నాగరాజు



ముండ్లమూరు సచివాలయం చుట్టూ ఉన్న చెట్లు



శంకరాపురం సచివాలయం ఎదుట దర్శనమిస్తున్న పిచ్చి మొక్కలు

నిరుపయోగంగా సచివాలయ భవనాలు

- పట్టించుకోని అధికారులు
- పంచాయతీ కార్యాలయాల్లోనే విధులు
- ఉపయోగంలోకి తేవాలని ప్రజల విజ్ఞప్తి

ముండ్లమూరు (దర్శి):

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయాల్లో పాలన అధోగతి పాలవుతోంది. అధికారులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారే కానీ వారికి ఎటువంటి వసతులు సమకూర్చడం లేదు. దీంతో నిర్మాణాలు పూర్తి చేసుకుని ఉన్న సచివాలయం భవనాలు ఉపయోగించుకోకుండా అధికారుల వ్యవహరిస్తున్న తీరు వారి నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోంది. గత ప్రభుత్వం హయాలో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మాణాలు పూర్తి చేయగా కొన్ని సచివాలయాలు గత ప్రభుత్వంలో ప్రారంభించారు. మరికొన్ని సచివాలయాలు ఎన్నికల కోడ్ తదితర కారణాలతో నిలిచి పోయాయి. పనులు పూర్తి అయినా ఆ సచివాలయ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. ముండ్లమూరు మండలం ముండ్లమూరు, శంకరాపురం, పోలవరం, ఉమామహేశ్వరపురం, జమ్ములమడక, గ్రామ సచివాలయాలు పూర్తిస్థాయిలో నిర్మాణాలు పూర్తయి ప్రభుత్వం ఆధీనంలో ఉన్నా ప్రారంభోత్సవాలకు నోచుకోలేదు. ముండ్లమూరు మండలంలో ఒక్కో సచివాలయానికి రూ.60 లక్షలతో, ఒక్కో రైతు భరోసా కేంద్రానికి రూ.20 లక్షల నిధులు కేటాయించి నిర్మాణాలు చేపట్టారు. ముండ్లమూరు సచివాలయం సిబ్బంది పంచాయతీ కార్యాలయంలో ఉంటున్నారు. సచివాలయం పూర్తి చేసి ప్రభుత్వానికి ఇచ్చినా అందులో సేవలందించడం లేదు. ప్రస్తుతం సచివాలయ సేవలన్నీ అక్కడే చేపడుతున్నారు. ఆ కార్యాలయంలో బీరువాలు, టేబుళ్లు ఉండి ఇరుకుగా ఉండటంతో మనిషి లోనికి వెళ్తే బయటకు వచ్చే అవకాశం లేకుండాపోతోంది. దీంతో మండల కేంద్రంలో ఆ కార్యాలయంలో ఎవరైనా పనులపై వెళ్తే బయట నిలబడి ఒకరు వెళ్లి వచ్చిన తర్వాత మరొకరు పని కోసం లోనికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. శంకరాపురం, పోలవరం సచివాలయాల వద్ద చెట్లు పెరిగి పురుగు పుట్ర తిరుగుతున్నాయి. ఈ సచివాలయాలు కూడా పంచాయతీ కార్యాలయంలలోనే సచివాలయ విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కో సచివాలయం పరిధిలో 11 మంది సిబ్బంది ఉంటారు. పంచాయతీ కార్యాలయంలో ఉండే ఒక్క రూంలో వారందరూ విధులు నిర్వర్తించాలంటే అసౌకర్యంగా ఉంటోంది. పోలవరం సచివాలయ సేవలు పంచాయతీ కార్యాలయంలో నిర్వర్తిస్తుంటే అక్కడ భవనంలో వర్షం కురిస్తే నీరు కారి టేబుళ్లు, పలు ఫైళ్లు, ఇతర ఫర్నిచర్ తరచూ తడిచి పోతోంది. దీంతో సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పూరిమెట్ల సచివాలయం నిర్మాణ దశలో ఉండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు ముందుకు కదలక అలాగే నిలిచిపోయాయి. చిల్ల చెట్లు పెరిగి శిథిలావస్థకు చేరుకుంటోంది. దీంతో సచివాలయం సేవలు పంచాయతీ కార్యాలయంలోనే నిర్వర్తిస్తున్నారు. జమ్మలమడక, ఉమామహేశ్వరపురం గ్రామ సచివాలయాల వద్ద చిల్లచెట్లు పెరిగి ఉన్నాయి. ప్రస్తుతం ఈ సచివాలయాలను ఉపయోగంలోకి తీసుకురాకుంటే నూతన భవనాలు పర్యవేక్షణ లేక శిథిలావస్థకు చేరే అవకాశం ఉంది. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మాణాలు చేపట్టిన సచివాలయాలు పరిస్థితి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పట్టించుకోకుండా వదిలేయయంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సచివాలయ భవనాలను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



కూటమి అధికారంలోకి వచ్చాక పనులు ప్రారంభించిన పూరిమెట్ల సచివాలయం



నడిచేందుకు కూడా ఖాళీ లేని ముండ్లమూరు పంచాయతీ కార్యాలయంలోని సచివాలయం

జగన్‌పై దుష్ప్రచారం చేస్తున్న వారిపై ఫిర్యాదు



ఏఎస్సై భాస్కరరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



తాళ్లూరు: పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కురిచేడు: ఐ టీడీపీ, జనసేన కార్యకర్తలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వైవీ సుబ్బయ్య డిమాండ్ చేశారు. దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఏఎస్సై భాస్కరరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియాలో చెప్పలేని భాషలో అనుచిత పోస్టులు చేయడం బాధాకరమన్నారు. మాజీ సీఎంపై తప్పుడు పోస్టులు పెడుతున్నా పట్టించుకోకపోవటం దారుణమన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైవీ సుబ్బయ్యతో పాటు ఎంపీటీసీ బి.వెంకట నర్సయ్య, యాదవ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎన్.రాజయ్య, పడమరకాశీపురం మాజీ సర్పంచ్ సాదం నాసరయ్య, సీనియర్ నాయకులు ఎస్.ప్రతాపరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు జి.లింగారెడ్డి, ఐ.సుబ్బారెడ్డి, టి.పాపయ్య, పి. గురునాథం, ఎన్. రమణారెడ్డి, షేక్ మౌలాలీ పాల్గొన్నారు.

తాళ్లూరు: సోషల్ మీడియాలో ఐ టీడీపీ, జనసేన కార్యకర్తలు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై చేస్తున్న దుష్ప్రచారాన్ని, వికృత చేష్టలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తూము వెంకట సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నాయకులు గురువారం ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా తూము వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియాలో చెప్పలేని భాషలో, వారి ఇష్టారాజ్యంగా అనుచిత పోస్టులు చేయడం బాధాకరమన్నారు. మాజీ సీఎంపై తప్పుడు పోస్టులు పెడుతున్నా పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రోజు రోజుకూ వారి ఆగడాలకు హద్దే లేకుండా పోతోందని, అందుకే చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గోళ్లపాటి మోషే, మాజీ జెడ్పీటీసీ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు, ఉప సర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, గ్రామ సర్పంచ్‌లు బ్రహ్మారెడ్డి, చిమటా సుబ్బారావు, షేక్ వలి, కోట వెంకటరామిరెడ్డి, కుమ్మిత జయరామిరెడ్డి, సంగు కొండారెడ్డి, కైపు కోటిరెడ్డి, కోట కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు కరిముల్లా, గువ్వల శ్రీనివాసరెడ్డి, వలి, వెంకట్రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సానికొమ్ము దాతృత్వం



తిరుపతిరెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

దర్శి: పేద విద్యార్థులకు ప్రముఖ వ్యాపారవేత్త, వైఎస్సార్ సీపీ నాయకులు, నెడ్‌కాప్ మాజీ డైరెక్టర్ సానికొమ్ము తిరుపతిరెడ్డి తన దాతృత్వం చాటుకున్నారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో తమ పాఠశాలకు రూ.20 వేల విలువైన 20 కుర్చీలు అందజేశారు. ఆ పాఠశాలలో ఉపాధ్యాయులకు కుర్చీలు లేవని తెలుసుకుని వాటిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఖాదర్‌మస్తాన్, తిరుపతిరెడ్డిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఖాదర్‌మస్తాన్ మాట్లాడుతూ చిన్న వయసులోనే గొప్ప వ్యాపారవేత్తగా ఎదగడమే కాకుండా మంచి మనిషిగా అందరికీ సాయం చేస్తూ మంచి పేరు తెచ్చుకున్నాడన్నారు. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి ఒక గోల్‌ను ఎంచుకుని దాన్ని సాధించే వరకు పట్టుదలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు శిక్షణ

మార్కాపురం టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పీఎంకేవీవై 4.0లో భాగంగా పదో తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియెట్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువకుల కోసం మార్కాపురం పట్టణంలోని ఎస్‌పీసీ ట్రెనింగ్ సెంటరులో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ప్లంబర్ కోసం శిక్షణ ఇస్తామని స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జె.రవితేజ తెలిపారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు

కంభం: విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోకుండా పట్టుదలతో చదువుకొని ఉన్నతశిఖరాలకు చేరాలని కంభం సీఐ మల్లిఖార్జున అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సాయంత్రం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినిలను వేధించడం, ర్యాగింగ్‌కు పాల్పడటం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆన్‌లైన్ మోసాలు అధికంగా జరుగుతున్నాయని అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ, బ్యాంకులకు సంబంధించిన ఇతర వివరాలు అడిగితే చెప్పకుండా జాగ్రత్త వహించాలన్నారు. బాల్యవివాహాలకు పాల్పడ కూడదని చదువుకోవాల్సిన వయస్సులో ఆడపిల్లలను చదివించాలన్నారు. నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. యువకులు గంజాయి, డ్రగ్స్ వంటి వాటికి బానిసలు కాకూడదని సూచించారు. ఎస్సై బి. నరసింహారావు పాల్గొన్నారు.

చెట్ల పెంపకంపై అవగాహన ఉండాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అనుసాగర్

ముండ్లమూరు (దర్శి): అటవీయేతర ప్రాంతాల్లో చెట్ల పెంపకంపై అవగాహ ఉండాలని వ్యవసాయ కమ్యూనిటీ కో ఆర్డినేటర్ అనుసాగర్ సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద రైతులకు గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనుసాగర్ మాట్లాడుతూ అడవులతో కలిగే ప్రయోజనాలు వివరించారు. చెట్ల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ జరిగి వాతావరణ సమతుల్యత, బొగ్గుపులుసు వాయువును కిరణజన్య సంయోగ క్రియ ద్వారా కాలుష్యాన్ని నియంత్రిస్తామని తెలిపారు. వివిధ అటవీ చెట్ల గురించి వాటి సాగు గురించి అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనర్ ఆనంద్‌కుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలుదారులకు బిల్లు తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్

పెద్దారవీడు: ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని మార్కాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీనాయక్ అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఎరువుల దుకాణాల యజమానులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన వాటికి బిల్లు కచ్చితంగా ఇవ్వాలని, అలా ఇవ్వని పక్షంలో షాపుల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన ఎరువులు, పురుగుల మందుల మాత్రమే అమ్మాలని, ఎలాంటి అనుమతి లేని వాటిని విక్రయించరాదని చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా లైసెన్స్ లేకుండా ఎరువులు, రసాయన మందులు అమ్మితే, బయో పురుగు మందులు విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకొని వారి షాపు లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. షాపుల్లో స్టాక్ బోర్డు, బిల్లు పుస్తకాలు, రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. సమావేశంలో వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి, దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన



ఏఈ మాట్లాడుతున్న శ్రీనివాసరావు

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోలార్ విద్యుత్‌పై అవగాహన గురువారం కల్పించారు. సోలార్ విద్యుత్ వినియోగంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి విద్యార్థులు ప్రజలను చైతన్య పరచాలని విద్యుత్ శాఖ దర్శి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఈ.శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎం ఘర్ సోలార్ ప్రాజెక్టులో భాగంగా సోలార్ ఏర్పాటు చేసేందుకు తక్కువ ఖర్చు అవటమే కాకుండా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చని, సోలార్ ద్వారా కిలో వాట్స్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.30 వేల సబ్సిడీ ఇస్తుందని, రెండు కిలో వాట్స్‌కు రూ.60 వేల సబ్సిడీ ఇస్తుందన్నారు. సోలార్ విద్యుత్‌ను గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు, గ్రామస్తులకు సోలార్‌పై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ సోలార్ వినియోగించుకునేలా చైతన్య పరచాలని కోరారు. సోలార్ ప్రాజెక్టుతో తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యుత్ పొందవచ్చని, దీంతో ఎలాంటి ఇబ్బందులు ఉండవని, గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాసరావు సూచించారు. ఏఈ నాగూర్‌వలి, విద్యుత్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రసముద్రంలో వైద్య సేవలు



వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది



పారిశుధ్యం పనులు చేస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

దొనకొండ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.సునీత పర్యవేక్షణలో వైద్య సిబ్బంది గురువారం రుద్రసముద్రంలో వైద్య సేవలు అందించారు. మంచం పట్టిన రుద్రసముద్రం అనే వార్తకు స్పందించిన వైద్య సిబ్బంది గ్రామానికి చేరుకుని ఇంటింటికీ తిరిగి సర్వే చేపట్టి వైద్య పరీక్షలు చేశారు. జ్వర పీడితులను గుర్తించి వారికి రక్త పరీక్షలు, సెలైన్ ఎక్కించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అవసరమైతే వైద్య సేవలు గ్రామంలో కొనసాగిస్తామని, వైద్య సిబ్బంది నిత్యం గ్రామంలో ఉండే విధంగా చూస్తామని వైద్యాధికారి సునీత తెలిపారు. పంచాయతీ సిబ్బంది గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. బోరింగుల వద్ద మురుగు తొలగించారు. బ్లీచింగ్, ఫినాయిల్ చల్లారు. వీధుల వెంట ఫాగింగ్ చేశారు.

చదువుతో పాటు ఆటల్లో రాణించాలి



బాలికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సునీత

ముండ్లమూరు (దర్శి): విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించాలని కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ ఆవుల సునీత అన్నారు. స్థానిక పాఠశాలలో జిల్లా స్థాయి డ్రాయింగ్ పోటీల్లో తృతీయ బహుమతి గెలుపొందిన తేజశ్వినిని గురువారం అభినందించారు. ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ తేజశ్వనిలా ప్రతి విద్యార్థిని పోటీతత్వంతో ప్రతిభ కనబరచాలని సూచించారు. తేజశ్వని తండ్రి బాలఏసు తన కుమార్తెకు వచ్చిన ప్రైజ్ మనీని పాఠశాల అవసరాలకు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏపీఎం దేవరాజు

తాళ్లూరు: ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం దేవరాజు అన్నారు. మండలంలోని బెల్లంకొండవారిపాలెంలో డ్వాక్రా మహిళలతో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం దేవరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీపై తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. వాటిని ఉపయోగించుకుని మరింత అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో సీసీ సుచంద్ర, మహిళలు పాల్గొన్నారు.